ప్రజాశక్తి

గురువారం 1 డిసెంబరు 2022 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



గురజాడ వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎంఎండి ఇంతియాజ్ అహ్మద్

గురజాడ స్ఫూర్తితో ప్రజల్లో చైతన్యం తేవాలి

వర్ధంతి సభలో సిసిఎల్ఎ చీఫ్ కమిషనర్, సెర్ప్ సిఇఒ ఇంతియాజ్

ప్రజాశక్తి-విజయవాడ : ఎంతో ముందు చూపుతో సమాజాభ్యున్నతికి అభ్యుదయ రచనలు గావించిన మహాకవి గురజాడ అప్పారావు స్ఫూర్తితో ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిసిఎల్ఎ చీఫ్ కమిషనర్ అండ్ సెక్రటరీ, సెర్ప్ సిఇఒ ఎఎమ్‌డి.ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన బుధవారం మహాకవి గురజాడ 107 వర్ధంతి సభ స్థానిక బలోత్సవ్ భవన్లో జరిగింది. ముందుగా దేశమును ప్రేమించుమన్న గీతంపై విద్యార్థులు గీసిన 36 చిత్రాలతో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని ఇంతియాజ్ ప్రారంభించారు. అనంతర ప్రతి చిత్రాన్నీ పరిశీంచారు. చిత్రాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని, గురజాడ భావాలు ఇంకా ఆశాకిరణంగా ఉన్నాయని కొనియాడారు. అనంతరం జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి అనిల్ డ్యానీ అధ్యక్షతన జరిగిన ఈ (మిగతా 6లో)

తొలగని ఈ క్రాప్ కష్టాలు

- ఆర్‌బికెలు, మిల్లర్ల యంత్రాల మధ్య వ్యత్యాసాలు
- ధరలో కోత పడుతుందని రైతుల్లో ఆందోళన




ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ఈ ఏడాదీ రైతులకు ఈ క్రాప్ కష్టాలు తప్పడం లేదు. వెబ్‌ల్యాండ్లో కనిపించని భూముల వివరాలు ఈ క్రాప్‌లో నమోదు కాలేదు. ఈ క్రాప్ చేసుకున్న భూముల్లో ఎనిమిది శాతం రైతుల వివరాలు ఈ కెవైసి కాలేదు. ఆర్‌బికెలకు, మిల్లర్ల మాయిశ్చర్ యంత్రాలకు మధ్య వ్యత్యాసాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రాప్‌కాని రైతులకు చెందిన ధాన్యం మాయిశ్చర్ ఎక్కువ చూపి ధర తగ్గించి కొనేందుకు కొందరు మిల్లర్లు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర దక్కదేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మచిలీపట్నం మండలం బుద్ధవరం గ్రామానికి చెందిన రైతు తిరుమల వెంకట్రావు నాలుగు ఎకరాల్లో ఎంటియు 1318 వరి వంగడాన్ని సాగుచేశారు. నూర్పిడి పూర్తి చేసి ధాన్యం విక్రయించడానికి ఆర్‌బికెకు వెళ్లారు. కానీ ఆయన సాగుచేసిన నాలుగు ఎకరాలకుగాను ఒక ఎకరం మాత్రమే ఈ క్రాప్ అయింది. మిగిలిన మూడు ఎకరాల్లో పండిన ధాన్యాన్ని మిల్లర్లకు అమ్మేందుకు ప్రయత్నించారు. గ్రేడ్ ఎ రకానికి చెందిన ఈధాన్యం 75 కిలోల బస్తాకు రూ.1545 చెల్లించాల్సి ఉంది. అయితే బస్తాకు రూ.200 తగ్గించి రూ.1345 ధర మాత్రమే ఇస్తామని మిల్లర్లు చెప్పడంతో అధికారులు చుట్టూ తిరుగుతున్నారు. ఎకరానికి 36 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. బస్తాకు రూ.200 చొప్పున మూడెకరాలకు రూ.21,600 వరకు తగ్గించి అమ్ముకోవాల్సి వస్తోందని ఆ రైతు వాపోతున్నాడు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. అయితే ఈ సమస్య ఆ ఒక్క రైతుదే కాదు..బుద్ధవరం గ్రామంలో మొత్తం 720 ఎకరాల్లో వరి పంట సాగవ్వగా, 620 ఎకరాలు మాత్రమే ఈ క్రాప్‌లో నమోదైంది. జిల్లావ్యాప్తంగా ఇవే సమస్యలు కనిపిస్తున్నాయి. మొత్తం 3.96 లక్షల ఎకరాల్లో వరి పంట సాగయితే 3.90 లక్షల ఎకరాల విస్తీర్ణం మాత్రమే ఈ క్రాప్ అయింది. ఈక్రాప్ అయిన భూములకు సంబంధించి 8 శాతం వరకు భూములు ఈకెవైసి జరగలేదు. దీంతో వేలాది మంది రైతులు ధాన్యం అమ్మకాల్లో సమస్యలను ఎదుర్కొంటున్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు, వెబ్‌ల్యాండ్లో భూమి వివరాలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. పమిడిముక్కల మండలం చాగంటిపాడు రైతుల వద్ద సేకరించిన శ్యాంపిల్‌ను ఆర్‌బికెలో టెక్నికల్ అసిస్టెంట్ పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా 17 శాతానికి లోబడి తేమ ఉందని నిర్ధారించారు. సేకరించిన ధాన్యాన్ని ర్యాండమైజేషన్లో చూపిన విధంగా పమిడిముక్కల రైస్‌మిల్లుకు లారీలో తరలించారు. తమ వద్ద ఉన్న మాయిశ్చర్ మిషన్లో తేమశాతం 19కు పైగా ఉందని సాకులు చెబుతూ ధరలో కోతపెట్టే ప్రయత్నాలు చేశారు. ఉన్నతాధికారులు జోక్యంతో ఒకింత సమస్య పరిష్కారమైంది.





విజయవాడ, మచిలీపట్నంలలో జరిగిన కార్యక్రమంలో విద్యాదీవెన నమూనా చెక్కులను అందజేస్తున్న కలెక్టర్లు డిల్లీరావు, పి.రంజిత్ బాషా తదితరులు

విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించాలి

- ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు డిల్లీరావు, బాషా
- విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.58.04 కోట్లు జమ

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : విద్యకు పేదరికం అడ్డుకాకుడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న విద్యా దీవెన' పథకం ద్వారా అందించే పూర్తి ఫీజు రీయంబర్సుమెంట్‌తో ప్రతి విద్యార్థి ఉన్నత విద్యనభ్యసించి అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు ఎస్.డిల్లీరావు, పి.రంజిత్ బాషా అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నాలుగో విడత జూలై–సెప్టెంబర్ 2022 త్రైమాసికానికి సంబంధించిన ఫీజుల మొత్తాన్ని 'జగనన్న విద్యాదీవెన' పథకం ద్వారా బటన్ నొక్కి తల్లుల ఖాతాలలో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు శాసనసభ్యులు మల్లాదివిష్ణువర్ధన్, కష్ణాజిల్లా నుంచి కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక వర్చ్యువల్‌గా పాల్గొన్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో 211 కళాశాలలో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, బిఇడి, అగ్రికల్చర్, మెడికల్, నర్సింగ్ విద్యనభ్యసిస్తున్న 42,524 మంది విద్యార్థులకు రూ.30.50 కోట్లను 37,736 మంది తల్లుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆవుతు శ్రీ శైలజారెడ్డి, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.వి.విజయభారతి, గిరిజన సంక్షేమ అధికారి రుక్మాంగదయ్య తదితరులు పాల్గొన్నారు. మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ జగనన్న విద్యాదీ వెన ద్వారా జిల్లాలో 37,669 విద్యార్థులకు 32,886 మంది తల్లుల ఖాతాల్లో రూ.27.54 కోట్లను ప్రభుత్వం జమ చేసిందన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 4,910 మంది విద్యార్థులకు రూ.3.35 కోట్లు, అవనిగడ్డలో 6,601 మందికి రూ.4.35 కోట్లు, గన్నవరంలో 4,509 మందికి రూ.3.33 కోట్లు, గుడివాడలో 5,026 మందికి రూ.3.85 కోట్లు, పామర్రులో 5,210 మందికి రూ.3.81 కోట్లు, పెడనలో 4,820 మందికి రూ.3.38 కోట్లు, పెనమలూరు నియోజకవర్గంలో 6,593 మంది విద్యార్థులకు రూ.5.44 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.సరస్వతి, బిసి సంక్షేమ శాఖ డిడి సిహెచ్.లక్ష్మీదుర్గా, గిరిజన సంక్షేమ శాఖాధికారి ఫణి దూర్జటి, ముడా చైర్‌పర్సన్ బొర్రా నాగలక్ష్మీ దుర్గాభవానీ, డిపిఒ నాగేశ్వర నాయక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసనపై ఉక్కుపాదం

స్టేషన్లో నేతలకు ప్రజా సంఘాల నేతల పరామర్శ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ.1800 కోట్ల బకాయిలను వెంటనే ఇవ్వాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో ఉపాధ్యాయుల ఆందోళనకు పోలీసులు అనుమతి ఇచ్చినా శాంతిభద్రతలత పేరుతో నేతలను, ఉపాధ్యాయులను దౌర్జన్యంగా అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని అజిత్‌సింగ్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయి స్టేషన్లో ఉన్న నేతలను, ఎంఎల్‌సి లక్ష్మణరావును సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు, పలువురు ప్రజా సంఘాల నేతలు బి.రమణారావు, దుర్గారావు తదితరులు పరామర్శించారు. ఉపాధ్యాయుల ఆందోళనపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించారు. ధర్నా చౌక్‌లో ధర్నా షామియానాలు తొలగించారు. అరెస్టయిన వారిలో ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ప్రశాంతంగా ఆందోళనచేస్తున్న ఉపాధ్యాయులను అరెస్టు చేయటం దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించలేక ప్రభుత్వం నిర్బంధాన్ని ఉపయోగించడం శోచనీయమన్నారు. అరెస్ట్ చేసిన ఉపాధ్యాయులను, నేతలను వెంటనే విడుదల చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



అరెస్టయి అజిత్‌సింగ్‌నగర్ పోలీసుస్టేషన్లో ఉన్న యుటిఎఫ్ నేతలను పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నేతలు సిహెచ్.బాబూరావు, రమణారావు, దుర్గారావు తదితరులు

పథకాలను సద్వినియోగం చేసుకోండి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఎ.కొండూరు: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. బుధవారం మండలంలోని కంభంపాడు గ్రామంలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కంభంపాడు గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం వల్ల ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచిపోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, అందువల్ల ఆ సమస్యలను సరిష్కరించాలని సిపిఎం 11వ వార్డు సభ్యురాలు జెట్టి ప్రమీల, సిపిఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు అంతకుముందు గోపాలపురం గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడీ భవనానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాగి నర్సిరెడ్డి, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, చెన్నారావు, మండల అధ్యక్షుడు జడ్పిటిసి భూక్య గనియ, సర్పంచ్ కోట పుల్లమ్మ, ఎంపీటీసీ కోట పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-చందర్లపాడు: మండలంలోని లక్ష్మీపురం, గుడిమెట్ల గ్రామాల్లో రూ.32 లక్షలతో చేపట్టనున్న రెండు అంగన్వాడి కేంద్రాల భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలను దశలవారీగా సొంత భవనాల్లోకి మార్చే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆల సైదమ్మ , వైస్ ఎంపీపీ కల్పన, జడ్పిటిసి ముక్కపాటి నరసింహారావు, ఆల రామారావు, యార్లగడ్డ సత్యనారాయణప్రసాద్ పాల్గొన్నారు.



'ఇదేం ఖర్మ' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నందిగామ: 'ఇదేం ఖర్మ .. మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ప్రతీ కార్యకర్త విజయవంతం చేయాలని నందిగామ మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. బుధవారం నందిగామ టిడిపి కార్యాలయంలో టిడిపి ముద్రించిన ఇదేం ధర్మ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ వైసిపికి ఓట్లు వేసిన ప్రజలు తమకు ఇదేం ఖర్మ అని భావిస్తున్నారని, ఆ ఉద్దేశంతోనే అధినేత చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు శాఖ మూరి స్వర్ణలత, కామసాని సత్యవతి, మండవ కృష్ణకుమారి, యేచూరి రత్నకుమారి, మాజీ ఎంపిపి మన్నే కళావతి, శాఖ మూరి సరోజని పాల్గొన్నారు.

విద్యార్థులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ: విద్యా దీవెన పథకం ద్వారా పేద విద్యార్థుల ఆర్థిక ప్రమాణాలు మెరుగుపడుతుందని నందిగామ ఆర్డిఓ రవీంద్రరావు పేర్కొన్నారు. బుధవారం నందిగామ మండల కేంద్ధంలో ఎంఆర్ ఆర్ కాలేజిలో విద్యాదీవెన చెక్కులను నందిగామ ఆర్డిఓ ఎ.రవీంద్రరావు చేతుల మీదుగా నందిగామ నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకుని తమ జీవితాలు మెరుగుపర్చుకోవాలని కోరారు.

పర్యాటకంగా మద్దులమ్మ దేవాలయం అభివృద్ధి

ప్రజాశక్తి-కంచికచర్ల: గొట్టుముక్కల అడవిలోని మద్దులమ్మతల్లి ఆలయ ప్రాంగణం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం శ్మద్దులమ్మ ఆలయాన్ని, సమీప జలపాతాలను సందర్శించారు. అనంతరం అలయ ప్రాంగణంలో గ్రామ మాజీ సర్పంచ్ గుదే రంగారావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో ఆలయ అభివృద్ధిపై చర్చించారు. దేవాలయం పున:నిర్మించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వనరుల దృష్టా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుదే సాంబశివరావు, అక్కారావు, తాటుకూరు అమ్మారావు, దమ్మాలపాటి వెంకటరావు, తంగెళ్లమూడి రామారావు, తాటుకూరు రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

5న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ : కమల



మాట్లాడుతున్న కమల

ప్రజాశక్తి-కంచికచర్ల: ఈ నెల 5న విజయవాడలో జరగనున్న ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల కోరారు. కంచికచర్ల ఎన్జీవో కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆశా వర్కర్లకు నిర్దిష్ట పని గంటలు లేవని, ప్రభుత్వ ఉద్యోగులు కాదని, అలాంటివారికి రోజు మూడుసార్లు ఫేస్ మస్తర్ వేయాలని, ప్రభుత్వం ప్రకటన చేయటం సరికాదన్నారు. ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా నిరంతరం ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్లను, సంతకాలు పేరుతో సచివాలయాలు సబ్ సెంటర్లలో కూర్చోబెట్టటం, 104 వెహికల్ వచ్చినప్పుడు, ఆశ వర్కర్లకు సంబంధంలేని పనులు చేయించడం మానుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పనిచేయకపోతే అది ఆశ వర్కర్ తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఆశ వర్కర్లు ఎదుర్కొనే సమస్యలపై జిల్లా మహాసభలో చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ణయించి ఆందోళన పోరాటాలను రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.పుల్లమ్మ, వి.నాగమ్మ, వి.ప్రసన్న, గోవిందమ్మ, రజిని తదితరులు పాల్గొన్నారు.

పైడయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం



ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక మారుతి నగర్‌లో మంగళవారం భవనం ప్లాస్టింగ్ చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్ గురై మృతిచెందిన భవన నిర్మాణ కార్మికుడు సిందుపల్లి పైడయ్య మృతదేహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సి హెచ్.బాబూరావుతో బుధవారం సందర్శించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ పైడయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణం రంగంలో వివిధ వత్తుల్లో పనిచేస్తున్న కార్మికులు వివిధ రకాల ప్రమాదాలకు గురై చనిపోతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. సంక్షేమ బోర్డును, చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయకుండా మేన వేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. ఎన్నడూ లేని విధంగా నిర్మాణంలో రంగంలో పనిచేసే కార్మికులు సరైన ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెండింగ్ క్లెయిమ్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పైడయ్యకు సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, బిల్డింగ్ రంగం నాయకులు బాలస్వామి, రాము, శ్రీను, ఈశ్వర్‌రావు, రాజు నివాళు లర్పించారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి-కంచికచర్ల

మండలంలోని పేరకలపాడు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో షేక్ యూసఫ్ (45) అనే లారీ డ్రైవర్ మతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు గ్రామానికి చెందిన యూసుఫ్ కంచికచర్ల పట్టణంలో ఒక లారీ ఆఫీస్ లో లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నట్లు సమాచారం. రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని నందిగామ శవా గారానికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యానును పోలీసుల స్వాధీనం చేసుకున్నారు.

ముస్తాబాదలో కూలిన బౌద్ధ గృహాలయం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: గన్నవరం మండలం ముస్తాబాద వద్ద క్రీస్తుశకం 1వ శతాబ్ధం నాటి భౌద్ధ గుహాలయం కూలిపోయిందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. మొగల్‌రాజపురంలోని కల్చరల్ సెంటర్ నందు బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్తాబాద వెళ్లి కూలిపోయిన గుహాలయాన్ని పరిశీలించినట్లు తెలిపారు. శాతవాహన కాలంలో భౌద్ధ భిక్షవులు వర్షాకాలంలో నివసించేందుకు ఆగుహను వినియోగించారని చరిత్ర ఆధారాలు తెలియచేస్తున్నాయని తెలిపారు. ఎంతో చారిత్రాత్మక ప్రాంతం గురించి గ్రామస్థులు మేడసాని శ్రీనివాస్, వీరపనేని ప్రభాకర్‌కు వివరించినట్లు పేర్కొన్నారు. చారిత్రక ప్రాముఖ్యత కలిగిన గృహాలయాన్ని, మన వారసత్వ సందపను కాపాడాల్సిన అవసరం ఎంతయినా ఉందని తెలిపారు. భవిష్యత్తు తరాలకు చరిత్ర గురించి తెలియచేయడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఇటువంటి చారిత్రక ప్రాంతాలను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.



వ్యక్తిగత దూషణలతో సమావేశంలో గందరగోళం


సమావేశంలో టిడిపి, వైసిపి కౌన్సిలర్ల వాగ్వివాదం

ప్రజాశక్తి-నందిగామ: టిడిపి, వైసిపి కౌన్సిలర్లు వ్యక్తిగత దూషణలతో నందిగామ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం గందరగోళంగా మారింది. నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మీ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. నందిగామ పట్టణంలో రూ.89 కోట్ల వ్యయంతో జరుగుతున్న మంచినీటి పైపులైన్ పనులు మందకొడిగా సాగుతున్నాయని, అధికారులు కీలు బొమ్మలుగా మారారని టిడిపి ఫ్లోర్‌లీడర్ శాఖమూరి స్వర్ణలత విమర్శించడంతో వైసిపి కౌన్సిలర్లు పాకాలపాటి కిరణ్, యాకుబ్, కో ఆప్షన్ సభ్యులు దాసులు మాట్లాడుతూ స్వర్ణలత మానసిక పరిస్థితి బాలేదని విమర్శించారు. దీంతో ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలు చేసుకున్నారు. ఎజెండా రూపొందించే సమయంలో టీడీపీ సభ్యులను పిలవడం లేదని, అందుకే తమ వార్డు సమస్యలు చెప్తుంటే అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని టీడీపీ సభ్యులు ఆరోపించారు. ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ సభలో సభ్యులు ఒకరినొకరు గౌరవించుకుంటూ హుందాగా ప్రవర్తించాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ సభ్యులు ఎవరైనా తప్పుగా మాట్లాడితే వారిని సరిదిద్దాల్సిన బాధ్యత తోటి సభ్యులు తీసుకోవాలని చెప్పారు. అనంతరం 57 అంశాలతో కూడిన అజెండాను ఆమోదించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మాడుగుల నాగరత్నం, కమిషనర్ డాక్టర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అధికారి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



రేకుల షెడ్లు తొలగించాలి

ప్రజాశక్తి-వీరులపాడు: మండలంలో పలు గ్రామాల్లో రోడ్లు ఆక్రమణకు గురవుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారు. జుజ్జూరు గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో గ్రామ ప్రజలకు రాకపోకలు అంతరాయం కలగకుండా గ్రామపంచాయతీ సర్పంచ్ రామవతు కోటి రాము, స్థానిక నాయకులు చొరవ తీసుకొని ప్రజల రాకపోకలకు ఏర్పాట్లు చేశారు. దీని గుండా వాహనదారులు వెళ్లకుండా కొంతమంది గ్రామపంచాయతీ రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకొని గత రెండు రోజుల నుంచి అడ్డుకుంటున్నారు. కొత్త రోడ్డు నిర్మాణం చేపడుతుంటే సహకరించకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామ పంచాయతీ వారు తక్షణమే స్పందించి రోడ్డుపై వేసిన రేకుల షెడ్లను తొలగించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి : ఎంఎల్‌సి

ప్రజాశక్తి-వీరులపాడు: జుజ్జూరు గ్రామంలో మండల స్థాయి ఎన్నికల బూత్ కన్వీనర్ల సమావేశం బుధవారం జరిగింది. ఎమ్మెల్సీ మొండితో అరుణకుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎన్నికల కోసం కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా పనిచేయాలన్నారు. మండలంలో ప్రధాన రహదారి నిర్మాణం పూర్తవుతుందని, నిర్మాణం జరిగేటప్పుడు కొంత ఇబ్బంది ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవుల రమేష్‌బాబు, వైసిపి కన్వీనర్ కోటేరు ముత్తారెడ్డి, జెడ్పిటిసి అమర్లపూడి కీర్తి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహనకు 11న 5కె, 10కె రన్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: ఆరోగ్యానికి సంబంధించి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహణ కల్పించాలనే ఉద్దేశంతో ఈనెల 11వ తేదీన మణిపాల్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో 10కె, 5కె రన్‌ను నిర్వహించనున్నట్లు హాస్పటల్ డైరెక్టర్ సుధాకర్ కంటిపూడి తెలిపారు. మణిపాల్ హాస్పటల్ నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన వివరాలను తెలియచేశారు. రన్‌కు సంబంధించిన పోస్టర్‌ను డిజిపి కె.వి. రాజేంద్రనాథ్‌రెడ్డి ఆవిష్కరించారని తెలిపారు. ఈరన్‌ను 11వ తేదీ ఆదివారం ఉదయం విజయవాడ గుణదలలోని బిఆర్‌టిఎస్ రోడ్డు నందు నిర్వహించనున్నామని తెలిపారు. ఆరోగ్యం పట్ల అవగాహన కోసం గత ఏడాది నిర్వహించిన రన్‌లో మంచి స్పందన లభించిందని అందుకే ఈఏడాది కూడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈరన్‌లో అమరావతి రన్నర్‌ఉసతో పాటు వాకర్స్ క్లబ్‌లు కూడా పాల్గొంటాయని తెలిపారు. రన్‌కు సంబంధించి రిజస్ట్రేషన్ కోసం 9618558989, 7569304232లకు సంప్రదించవచ్చని తెలిపారు.



ప్రతిపక్షాల గొంతునొక్కాలని చూస్తే సహించం

- మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ

పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తే సహించేది లేదని, అంతకంటే అవివేకం మరొకటి ఉండదని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన పరిణామాలపై ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇప్పటి వరకు జరిగిన ఉద్యమాలన్నీ కాక తాళియముగా జరిగిన ఉద్యమాలన్నీ పోలీసుల సహకారంతో అణిచివేసి తామేదో విజయం సాధించినట్లుగా ప్రభుత్వం విర్రవీగుతోందని విమర్శించారు. పోలీసులు తమ వ్యవహార శైలిని మార్చుకోవాలని, ఇప్పటికే పోలీసులు ప్రవర్తిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. దళిత మహిళా సర్పంచ్ పైనపాముల కృష్ణకుమారి పట్ల ఎమ్మెల్యే వ్యవహార శైలి కారణంగా రాల్చిన ప్రతి కన్నీటి బొట్టు వైసిపి పతనానికి ఓ మెట్టు అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూల దండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఆరు మండలాల అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రాం, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు తలసిల స్వర్ణలత, అవనిగడ్డ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు బండి నాగవెంకట కనకదుర్గ, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న బుద్దప్రసాద్

సమానత్వం కోసం పోరాటం తప్పదు : ఐద్వా



మాట్లాడుతున్న మాధవి

ప్రజాశక్తి-గన్నవరం : మహిళా సమానత్వం కోసం పోరాటం తప్పదని రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి మాధవి అన్నారు. బుధవారం గన్నవరం మండలం దావాజీ గూడెం బాలికల హాస్టల్లో మహిళా సమానత్వంపై ఐద్వా ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. మాధవి మాట్లాడుతూ.. సమానత్వ సాధనకై ఇంటా బయటా బహురూపాల్లో జరుగుతున్న హింసను నిరోదించాలన్నారు. డిసెంబర్ 10 వ తేదీ మానవహక్కుల దినోత్సవం వరకు 16 రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఐద్వా జిల్లా నాయకులు మల్లంపల్లి జయమ్మ మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఐద్వా 16 రోజులు వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు, పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. మహిళలపై హింస ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురి మహిళలలో ఒక మహిళ హింసకి గురవుతుందన్నారు. ప్రతి ఏటా మహిళలపై జరుగుతున్న హింస పెరుగుతూ ఉందన్నారు. మహిళలకు సామాజికంగా , ఆర్థికంగా , రాజకీయంగా , మగవారితో పాటు సమాన అవకాశాలు కల్పించినప్పుడే అణిచివేత అంతమవుతుందని అన్నారు. పలువురు ఉపాధ్యాయనిలు, హాస్టల్ వార్డెన్, సిబ్బంది, ఐద్వా నాయకులు మరియమ్మ, రాణి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-పెదపారుపూడి

స్థానిక పోలీస్ స్టేషన్ను పామర్రు సీఐ ఎన్. వెంకటనారాయణ బుధవారం సాధారణ తనిఖీలలో భాగంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పండుగ రోజులలో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు జూదాలు, కోడిపందాలు, ఇతరత్రా కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అన్నారుసంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై పి .నాగ కళ్యాణి పాల్గొన్నారు.



బుద్ధవరం పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం బుద్దవరం గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి దావాజిగూడెంలో బుధవారం ఎంపీపీ అనగాని రవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 లక్షల నిధులతో గ్రామ సచివాలయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిషత్ నుంచి సిమెంట్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బడుగు బాలమ్మ, గ్రామ వైసిపి నాయకులు గొంది పరందమయ్య, పంచాయతీ కార్యదర్శి సత్యబాబు పాల్గొన్నారు.

3న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ పట్టణ ప్రజలు ఏనాటి నుంచో ఎదురుచూస్తూన్నా రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఫ్లైఓవర్) నిర్మాణ పనులను డిశంబర్ 3న ఎంపి వల్లభనేని బాలశౌరి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వం్రావులు ప్రారంభిస్తారని వైసీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ తెలిపారు. బుధవారం స్థానిక బస్టాండ్ ఇన్ గేట్ దగ్గర ప్రారంభం కానున్న పనులను దుక్కిపాటి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన ఫ్లైఓవర్ బిడ్జి పనుల ప్రారంభోత్సవంలో ప్రజలు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు.



క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం

జగనన్న క్రీడా సంబరాలు కష్ణా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో పాల్గొనే గన్నవరం నియోజ కవర్గ జట్టు సభ్యులను నియోజకవర్గ బాధ్యు లు దాసరి శ్రీహర్ష బుధవారం ప్రకటిం చారు. గన్నవరం నియోజకవర్గ పురుషుల క్రికెట్ జట్టు డిసెంబర్ 2వ తేదీ నుండి గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరగనున్న పోటీలలో పాల్గొంటుందని ఆయన తెలిపారు. జట్టులో పి.సాయి, కె.తేజ, పి.రవి, టి.సతీష్,ఎన్.ప్రేమ్ కుమార్, డి.విజయ్ లక్ష్మణ్, ఎం.గిరీష్, వి.అభినయ్ , టి.సుదేపల్లి ఎస్.కె పర్వాన్. టి.రఘు నందన్, ఎండి సోహేల్. ఎస్కే ఆరిఫ్ లు ఎంపికైనరు , ఎంపికైన సభ్యులకు దాసరి శ్రీహర్ష వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

ఘంటసాలపాలెం సచివాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని ఘంటసాల పాలెం సచివాలయ భవన నిర్మాణ పనులకు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు బుధవారం భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, జడ్పిటిసి సభ్యులు తుమ్మల మురళీకష్ణ, వైసీపీ మండల కన్వీనర్ వేమూరు వెంకట్రావ్, సర్పంచ్ దోనె రజిని - దోనె వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్రబాబు, ఎంపీటీసీ కొల్లూరి విజయ, సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, పిఎసిఎస్ చైర్ పర్సన్ లు తాతినేని వెంకట కష్ణారావు తదితరులు పాల్గొన్నారు

బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గుడివాడ : షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయం అధికారిగా బి.వెంకటరమణ బాద్యతలు బుధవారం స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటరమణకు బదిలీపై వెళ్ళే కె.రమాదేవి అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష వికాస సమితి సమన్వయకర్త డిఆర్‌బి ప్రసాద్, సిబ్బంది టి.ప్రవల్లిక, సునీత, ఆశజ్యోతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కామేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుడివాడ

విద్యుత్ ఉద్యోగుల శ్రేయస్సు కొరకు ఆత్మార్పణ చేసుకున్న అమరజీవి కార్మికరత్న ఎస్.ఏ,యస్ కామేశ్వరరావును ప్రతి విద్యుత్ ఉద్యోగి గుర్తు పెట్టుకోవాలని ఐఎన్‌టియుసి అనుబంధ ఎపిఎస్ఇఇయు -327 యూనియన్ గుడివాడ అధ్యక్షుడు పి.డేవిడ్‌రాజు అన్నారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని విద్యుత్ కార్యాయలంలో కామేశ్వరరావు 49వ వర్థంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథులుగా ఎగ్జికూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, డిప్యూటి ఇంజనీరు జి.వెంకటేశ్వర్లు, రూరల్ ఏడి శ్రీకృష్ణ, ఎఇలు, భానుప్రకాష్, సుబ్బారెడ్డిలు పాల్గొని కామేశ్వరరావు సేవలను కొనియాడరు. ఈ కార్యక్రమంలో యూనియన్ కర్యదర్శి యు.కృష్ణారావు, కార్యాలయం సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపు పూర్తి

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉన్న ఇంజనీరింగ్, ఆర్ట్స్ అండ్ సైన్స్, ఫార్మసీ కళాశాలల నుండి ఇంకా జిల్లా లోని వర్సిటీ అనుబంధ కళాశాలల్లోని వివిధ ఎన్ఎస్ఎస్ యూనిట్ల నుండి 10 మంది విద్యార్థులు ,ఒక ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.కవిత తో కూడిన బందం హిమాచల్ ప్రదేశ్ లో ఈనెల 15 నుండి 24 వరకు నిర్వహించిన నేషనల్ అడ్వెంచర్ క్యాంపుకు హాజర య్యారు. కేంద్రప్రభుత్వ ఆధీనంలోని యువజన విభాగం క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్, నార్కండ లోని అటల్ బిహారీ వాజ్ పేయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ స్పోర్ట్స్ లో నిర్వహించిన ఈ శిక్షణా శిబిరంలో భాగంగా తాడు సాయంతో పర్వతా రోహణ, ప్రమాద సమయంలో సంభవించే పరిస్థితుల్ని ఎదుర్కోవడం, ట్రెక్కింగ్ లాంటి కొన్ని సాహసకత్యాలకు సంబంధించిన మెళకువల్ని నేర్పించారు. క్యాంప్ కి వెళ్లివచ్చిన టీమ్‌ని వర్సిటీ ఉపకులపతి, ఎన్ఎస్ఎస్ చైర్మన్ ఆచార్య కె బి చంద్రశేఖర్ ప్రశంసిస్తూ శీతాకాలంలో సిమ్లా లాంటి ప్రదేశాలలో సున్నా డిగ్రీలకన్నా తక్కువ ఉష్ణోగ్రత వాతావరణ పరిస్థితులకు సైతం వెనుదీయక శిక్షణను పూర్తిచేసుకురావడం అభినందనీ యమన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ మరియు రిజిస్ట్రార్ ఐ/సి ఆచార్య డి సూర్యచంద్ర రావు, వర్సిటీ ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త మరియు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం బాబు రెడ్డి,ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. కవిత,డా.వి.సుజయ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులలకు రూ.19 కోట్ల బోనస్ చెల్లింపు

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని అంజనేయులు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని అంజనేయులు అధ్యక్షతన బుదవారం హనుమాన్ జంక్షన్‌లో జరిగిన జిల్లా పాలకవర్గ సమావేశంలో 2022-2023 ఆర్థిక సంవత్సరమునకు గాను బోనస్ కింద 19 కోట్ల రూపాయలను చెల్లించేందుకు పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. ఈసందర్భంగా చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో మూడు విడతల కింద 50 కోట్ల రూపాయలు, 2022-2023 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడత 16 కోట్ల బోనస్ ను రైతులకు పంపిణీ చేశామన్నారు. అంతేకాకుండా ఈ ఆర్థిక సంవత్సరం లో పాడి రైతు, పశు సంక్షేమం కింద ఈ ఎనిమిది నెలలకు గాను 10 కోట్లు ఖర్చు చేశామన్నారు. మన గ్రామాలు, మన రైతులు, మన పాలు, మన వినియోగదారులు, మన సంస్థ అనే లక్ష్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ ప్రయాణం చేస్తుందని, నాణ్యతలో రాజీ లేకుండా కష్ణా మిల్క్ యూనియన్ ఆరు దశాబ్ధాలుగా వినియోగదారులకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను అందజేస్తుందని తెలిపారు. హనుమాన్ జంక్షన్ సమీపంలోని వీరవల్లిలో 6 లక్షల లీటర్ల విస్తరణ సామర్థ్యంతో నిర్మిస్తున్న నూతన డెయిరి సంబంధిత పనులను వేగవంతంగా చేశామ న్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు, జిల్లా పాలక వర్గ సభ్యులు యెర్నేని సీతాదేవి, డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధన రావు, వి.బి.కె.వి సుబ్బారావు, ఉయ్యూరు అంజిరెడ్డి, అర్జా వెంకట నగేశ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడతున్న చలసాని ఆంజనేయులు

పేదలకు వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం : వెలంపల్లి

ప్రజాశక్తి-భవానీపురం: పేదలందరికీ సమగ్ర వైద్యం అందించే ధ్యేయంతో జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కబేళా వద్ద నూతనంగా నిర్మించిన రోటరీనగర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను వెలంపల్లి ప్రారంభించారు.



ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ నేటికి పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం మూడు అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఈ అర్బన్ హెల్త్ సెంటర్లలో ఒక్కో సెంటర్‌లో 10 బెడ్లు వుంటాయని, ఇక్కడి అన్ని వ్యాధులకు వైద్యం అందిస్తారని చెప్పారు. అలాగే వివిధ జబ్బులకు సంబంధించి ఇక్కడ 170 రకాల మందులు ప్రజలకు ఇస్తారని, 64 రకాల పరీక్షలు చేస్తారని వివరించారు. అనంతరం రూ.86.94 లక్షల వ్యయంతో బ్రహ్మయ్యకాలనీ, బృందావన్ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి వెలంపల్లి శంకుస్థాపన చేశారు. ఈ ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, మైలవరపు కష్ణ, 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, మైలవరపు దుర్గారావు, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, బాపతి కోటిరెడ్డి, పి.చైతన్యరెడ్డి, ఎండి.ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఎపి అర్చక ఐక్యవేదిక వినతి

ప్రజాశక్తి-వన్‌టౌన్: అర్చక సమస్యలను ప్రభుత్వం దృష్టికి, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి చర్చించి పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ అర్చక ఐక్య వేదిక (జెఎసి) అధ్యక్షులు కంతం నందీశ్వర్ కోరారు. ఆంధ్రప్రదేశ్ అర్చక ఐక్య వేదిక ఆధ్వర్యంలో వన్‌టౌన్ జమ్మిదొడ్డిలోని మంత్రి కార్యాలయంలో




దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సందీశ్వర్ మాట్లాఉడతూ ధార్మిక పరిషత్ ఏర్పాటు, అర్చక సంక్షేమ నిధి ట్రస్టుబోర్డు నియామకం మరియు అర్చక సమస్యలపై చర్చించి పరిష్కరించటానికి అర్చక ప్రతినిధులు, అధికారులతో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయుటకు కూడా గతంలో నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఇతర అర్చక కమిటీలలో అర్చక ఐక్యవేదిక ప్రతినిధులకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని మంత్రిని కోరారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గగుడిలో ప్రతిరోజూ జరుగు నిత్య అన్నదానం పథకానికి కష్ణా జిల్లా ఈడుపుగల్లు గ్రామం, కంకిపాడుకు చెందిన సూర్యదేవర వీరభద్రరావు, బిజిలీ కుమారి, (లైలా) కుటుంబ సభ్యులు రూ.5.00,116, అలాగే గన్నవరంకి చెందిన మరో దాత బోయపాటి శీతారామాంజనేయులు, శ్రీమన్నారాయణ, కుటుంబ సభ్యులు రూ.2,00,116, తెలంగాణా రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన తిరుపతయ్య, రమాదేవి కుటుంబ సభ్యులు రూ.1,00,116లు బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి దర్భముళ్ళ భ్రమరాంబను కలిసి దాతలు చెక్కు రూపంలో తమ విరాళాలను అందజేశారు. దాత కటుంబ సభ్యులకు దుర్గమ్మ దర్శనం చేయించి, అమ్మవారి ప్రసాదం అందజేశారు.

పేదలకు ఉచిత భోజనం

ప్రజాశక్తి-వన్‌టౌన్: మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా పేద ప్రజలకు ఉచిత భోజన సదుపాయం కల్పించినట్లు టిడిపి మైనార్టీ నాయకులు కె.నాగుల్‌మీరా తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) సౌజన్యంతో కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మొబైల్ అన్న క్యాంటీన్ 35వ రోజు బుధవారం 53వ డివిజన్‌లో నిర్వహించారు. తొలుతగా 'ది కష్ణవేణి హోల్‌సేల్ కాంప్లెక్స్' వ్యవస్థాపకులు బచ్చు వెంకట నరసింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాగుల్‌మీరా, యువ నాయకులు కాండ్రేగుల రవీంద్ర, బచ్చు ప్రసాద్, చింతలపూడి రఘురాం చేతుల మీదుగా అన్న క్యాంటీన్ ప్రారంభించారు.



'గ్రీన్‌టెక్'ను తొలగించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో గల గ్రీన్ టెక్ ఫ్యాక్టరీని తొలగించాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్ దగ్గర విద్యార్థులుతో పాఠశాల ముగిసిన అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ గ్రీన్ టెక్ ఫ్యాక్టరీ నుండి వస్తున్న దుర్వాసన వల్ల విద్యార్థులు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నారని, వారం రోజుల క్రితం కొంతమంది విద్యార్థులు వాంతులు కూడా చేసుకోవడం జరిగిందిని తెలిపారు. గతంలో విద్యార్థులు, గ్రామస్తులు ఫ్యాక్టరీని తొలగించాలని అనేకమార్లు ఆందోళన కార్యక్రమాలు మరియు వినతిపత్రంలు అధికారులుకు అందజేసిన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదని అన్నారు. గ్రీన్ టెక్ ఫ్యాక్టరీ నుండి విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఫ్యాక్టరీ అక్కడి నుంచి తొలగించి ఊరికి దూరంలో దానిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే విద్యార్థులను తల్లిదండ్రులను కలుపుకొని ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగ్గయ్యపేట మండల కార్యదర్శి గౌస్ మియా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అలాగే షేర్ మహమ్మద్ పేట జిల్లా పరిషత్ పాఠశాలను బుధవారం నియోజకవర్గ ఎంఆర్పిఎస్ ఇన్చార్జి మాతంగి దావీదు మాదిగ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సందర్శించింది. అస్వస్థత గురైన విద్యార్థులను



నాయకులు పరామర్శించారు. అనంతరం గ్రీన్ టెక్ కెమికల్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఈ సందర్భంగా దావీదు మాట్లాడుతూ గ్రీన్ టెక్ యాజమాన్యం పిల్లల ఆరోగ్య విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించినా తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్పిఎస్ ఇన్చార్జి పాము మహేష్, సామీలు, వత్సవాయి మండల ఎంఆర్పిఎస్ ఇన్చార్జి జిల్లేపల్లి రమాక్రాంతి, మాతంగి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి : ఐద్వా



ప్రజాశక్తి-భవానీపురం: మహిళలపై అత్యాచారలు, లైంగిక వేధింపులు, హత్యలు పెరిగిపోయాయని, వాటిని నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి కోరారు. హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం నేతాజీ స్కూల్ విద్యార్థులు ప్లకార్డులు చేతబూని భవానీపురంలోని పాఠశాల నుండి క్రాంబ్వే రోడ్డు, హౌసింగ్‌బోర్డు కాలనీ పలు వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అత్యాచారాలకు మూలమైన మద్యం, మత్తు పదార్థాల అమ్మకాలు యదేచ్ఛగా సాగుతున్నాయని మండిపడ్డారు. అశ్లీల సాహిత్యాన్ని, సినిమాలను, వీడియోలను సెన్సార్ చేయలేకపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు విస్తతంగా మహిళా రక్షణ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్ష కార్యదర్శులు కుండనాల శేషుమణి, గాదె ఆదిలక్ష్మి, నేతాజీ స్కూల్ కరస్పాండెంట్ కె.తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ కె.అరుణ, కె.దినేష్, ఐద్వా ఆఫీస్ బేరర్స్ విక్రమ్ లక్ష్మీ, వి.స్వప్న, కె.ఉషారాణి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని 50వడివిజన్ పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జగనన్న విద్యా దీవెన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు (సిపిఎం), విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, 40వ డివిజన్ కార్పొరేటర్ ఆంజనేయ రెడ్డి, హిస్టరీ అకాడమీ బోర్డు డైరెక్టర్ వాజిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి-వన్‌టౌన్

పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో వీర్రాజు ఇంటి వీధి డ్రైనేజీ లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితిని విఎంసి కమిషనర్ పుండ్కర్ దృష్టికి కార్పొరేటర్ బోయి సత్యబాబు తీసుకువెళ్ళారు.



ఈ నేపథ్యంలో రూ.60 వేల అంచనాలతో బుధవారం డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది. ఈ పనులను కార్పొరేటర్ బి.సత్యబాబు పరిశీలించారు. ఈ పర్యటనలో సిపిఎం నాయకులు పి.రాజు, బాలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఇనాం భూముల సమస్యను పరిష్కరించండి : సామినేని

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: తాడేపల్లిలోని భూ పరిపాలన శాఖ చీఫ్ కమిషనర్ ప్రసాద్‌తో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమావేశం అయ్యారు. పట్టణంలోని ఐదు వేల కుటుంబాలు ఇనామ్ భూములతో అవస్థలు పడుతున్నారని, ఆర్థిక ఇబ్బందులతో వారు సతమతమవుతున్నారని తెలిపారు. సుమారు 25 ఏళ్ల క్రితం ఈ భూములను పట్టించుకునే వారు ఎవరూ లేకపోవడంతో పేదరికంలో ఉన్న నాటి దేవస్థాన సిబ్బంది ఆ భూములను అమ్ముకున్నారని, భూమి చేతులు మారడంతో ఆ సమస్య జటిలమవుతుందని తెలిపారు. ఇనామ్ భూములతో బాధపడుతున్న వారి సమస్యకు పరిష్కారం చూపి చట్టబద్ధత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరగా, వచ్చే అసెంబ్లీ సమావేశాలలో ఈ బిల్లును ప్రవేశపెట్టేలా చూస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

రైలులో గాంధీ నాగరాజన్ దీక్ష

ప్రజాశక్తి-భవానీపురం: కొత్తగా నిర్మిస్తున్న పార్లమెంట్ భవనానికి జాతిపిత మహాత్మాగాంధీ పేరు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ పేరు పెట్టాలని, అలాగే పార్లమెంట్ భవన్ ప్రాంగణంలో వారిద్దరి కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలని విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఊర్మిళానగర్‌కు చెందిన గాంధీ దేశం సోషల్



వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ డిమాండ్ చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ హత్యకు గురైన 1948 జనవరి 30 తేదీని గుర్తు చేస్తూ ప్రతినెలా 30 తేదీన కళ్లకు గంతలు కట్టుకొని ఒక రోజు ఉపవాస దీక్షలు చేపట్టే ఆయన బుధవారమూ తన దీక్షను కొనసాగించారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా కోరుతూ ఢిల్లీ పార్లమెంట్ ఆవరణలో అన్ని రాష్ట్రాల ఎంపీలకు వినతి పత్రాలు అందించడానికి, విభక్త ఆంధ్రప్రదేశ్‌కి జరుగుతున్న అన్యాయాన్ని వివరించి రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశంపై అందరు ఎంపిల మద్దతు ఇవ్వాలని కోరడానికి ఢిల్లీ వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో కళ్లకు గంతలు కట్టుకొని ఉపవాస దీక్ష చేపట్టారు. తిని సైతం మర్చిపోతే ఎలా అంటూ అందుకే ప్రతినెలా 30 తేదీన ఈ కార్యక్రమం చేపడుతున్నామని ఆయన తెలిపారు.

గందరగోళంగా తిరువూరు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం అధికార, ప్రతిప క్ష సభ్యుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. బుధవారం చైర్ పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో పైపులైన్లు పగిలి 10 రోజుల నుండి పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీరు రావడంలేదని టిడిపికి చెందిన కౌన్సిలర్ షేక్ హుషేన్ పేర్కొనగా అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు (బీరు వాలబాబు), వైస్ చైర్ పర్సన్ వెలుగోటి విజయలక్ష్మిలు జోక్యం చేసుకుని పైపు లు ఎక్కడ పగిలాయి అనేది సచివాల యంలో ఫిర్యాదు చేశారా అని హుషేన్ ను ప్రశ్నిస్తూ పగిలి ప్రాతంలో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తు న్నామని, లేటయితే ట్యాంకర్ ద్వారా మంచి నీటిని సరఫరా చేయిస్తున్నామ ని చెప్పారు. మీరు ఎవరికి చెప్పకుండా పైపులైన్లు పగిలాయని, ఆవి ఎక్కడో కూడా తెలియకుండా ఆరోపించటం ఏమిటని హుషేన్ నుకు చైర్ పర్సన్ తో సహా సభ్యులు ఘాటుగా సమాధానం చెప్పారు. నావార్డు జంక్షన్ రోడ్డు వద్ద తూర వేయమని ఏఈని అడిగితే బీరు వాల బాబు చెప్తే వేస్తామని అన్నారని హుషేన్ అతనికి అనటంతో నా పేరు ఎందుకు చెప్తారు, నేను ఏమైనా అధి కారినా అని బీరువాల బాబు హుషేన్ పై విరుచుకుపడ్డారు. ఈక్రమంలో హుషేన్ తో పాటు మరో టిడిపి కౌన్సి లర్ నాల్లా సురేంద్ర కు బీరువాల బాబు కు మధ్య తీవ్రమైన వాగ్వాదం చోటుచే సుకుంది. మిగిలిన సభ్యులు వారిని వారించారు. చైర్ పర్సన్ వేలు ఎత్తు చూపించటంపై హుసేన్ ఆమెపై మండి పడ్డారు. సభామర్యాదలకు భంగం కలి గిస్తే సహించేది లేదని చైర్ పర్సన్ పేర్కొన్నారు. దీనితో ఇరువర్గాల సభ్యు లు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవటం సమావేశం గందరగోళం మధ్య ముగిసింది.



ధాన్యం కొనుగోలును పారదర్శకంగా నిర్వహించాలి : పేర్ని

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రైతులకు ఎలాంటి సమస్య లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, కొనుగోలు ప్రక్రియలో అవినీతికి తావులేకుండా నిబంధనలు పాటించి, పారదర్శకంగా నిర్వహించాలని బందరు శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య(నాని) అధికారులను ఆదేశించారు. బందరు నియోజకవర్గ పరిధిలో ధాన్యం కొనుగోలు సమస్యలపై బుధవారం జిల్లా పరిషత్ మీటింగ్ ల్లో సివిల్ సప్లయ్స్, రెవెన్యూ, కోఆపరేటివ్ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు టెక్నికల్ అసిస్టెంట్లతో శాసన సభ్యులు జాయింట్ కలెక్టర్ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. బందరు మండలంలో వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు శాసన సభ్యుని దృష్టికి వచ్చిన రైతుల సమస్యలపై అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల పట్ల రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చే రైతులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియ విశధీకరించాలని అన్నారు. ముందుగా గోనె సంచులు తీసుకొని కోతలు మొదలు పెట్టకపోతే వెనక్కి తెచ్చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల అనుబంధ సిబ్బంది రైతు సహాయకులతో కలసి రైతుల పొలాల వద్దకు వెళ్లి శాంపిల్స్ సేకరించాలన్నారు. ముఖ్యంగా తేమ శాతం విశ్లేషణలో టెక్నికల్ అసిస్టెంట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఆర్బీకేలో తేమ శాతం ధృవీకరణ పొందాక, మిల్లు వద్ద తేడా వచ్చిన సందర్భాల్లో మిల్లు వద్ద వాహనాలు బ్లాక్ కాకుండా చూడాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు మిల్లర్లతో కలసి అవకాశం ఉందని, అట్టివారిని ఉపేక్షించవద్దన్నారు. ధాన్యం కొనుగోలులో రవాణా పరమైన సమస్యలు ఉంటే వాహన తనిఖీ అధికారులకు, తహసీల్దారుకు ఫిర్యాదు చేయాలని, వారి ఫోన్ నెంబర్లు అందరి వద్ద ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.అపరాజిత సింగ్, ఆర్డీఓ ఐ. కిషోర్, సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ శ్రీధర్, డ్వామా పీడీ జివి. సూర్యనారాయణ, డిసి ఓ ఫణికుమార్ . మత్స్యశాఖ జేడి శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఏ పేర్ని వెంకట్రామయ్య



నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్

కష్ణా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల పరిధిలోని యూజీ డిగ్రీ కోర్సు వన్ టైమ్ ఆపర్చునిటీ పరీక్షా ఫలితాలను, యూజి 4వ సెమిస్టర్ రెగ్యులరు పునఃమూల్యాంకన ఫలితాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.బి. చంద్ర శేఖర్ ఆదేశాల మేరకు బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి డా.పి. వీర బ్రహ్మాచారి, అధనపు పరీక్షల నియంత్రణాధికారిడా, ఎల్ సుశీల పాల్గొన్నారు. వన్ టైమ్ ఆపర్చునిటీ పరీక్షా ఫలితాలను పునః మూల్యాంకన ఫలితాలను వెబ్సైతో www.kru.ac.in పొందు పరచిన్నట్లు పరీక్షల నియంత్రణాధికారిడా పి. వీర బ్రహ్మాచారి తెలియజేశారు.



శేష వాహనంపై మోపిదేవి స్వామి గ్రామోత్సవం

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామి వారి మార్గశిర షష్టి మహెూత్సవాల్లో భాగంగా మూడోరోజైన బుధవారం ఉదయం పూజ, నిత్య హెూమం, వసంతోత్సవం, పూర్ణాహుతి హెూమం, తదితర పూజలు అనంతరం శ్రీ స్వామివారి గ్రామోత్సవం శేష వాహనంపై అత్యంత వైభవంగా నిర్వహించారు. చర్లపల్లి స్టేట్ దేవాలయాల సహాయ కమిషనర్ ఎన్ సూర్య చక్రధరరావు పర్యవేక్షణ లో మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పవన్ కుమార్ శర్మ, సతీష్ శర్మ, విరూప్ శర్మ, సూపరింటెండెంట్ బి.సత్యనారాయణ, టి చెన్నకేశవ, టి రామకష్ణ, టి వెంకటేశ్వరరావు, పి నాగరాజు పాల్గొన్నారు.

సిఐటియు మొవ్వ మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - మొవ్వ : కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలని సిఐటియు మొవ్వ మండల కమిటీ డిమాండ్ చేసింది. సిఐటియు మొవ్వ మండల ద్వితీయ మహాసభ బుధవారం కూచిపూడిలోని సీతామహాలక్ష్మి ఫంక్షన్ హాలులో బుధవారం జరిగింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శీలం నారాయణరావు ప్రవేశపెట్టిన నాలుగు తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, బిల్డింగ్ కార్మికులకు సంక్షేమ బోర్డును అమలు చేయాలని, ఉపాధి భద్రత కల్పించాలని, అధిక ధరలను అరికట్టాలని కమిటీ తీర్మానించింది. ఈ మహాసభలో సిఐటియు మొవ్వ మండల నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా దగాని రాజారాత్నం, కాక రాజశేఖర్, ఉపాధ్యక్షులు దేవామణి, కె.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా కె.నాగలక్ష్మి, సిహెచ్.సుబ్రమణ్యం, కోశాధికారిగా రావులకొల్లు రవికుమార్లతోపాటు మరో 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. మహాసభలో దగాని రాజారత్నం, కాక రాజశేఖర్, వెంకటేశ్వరమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సిఐటియు జిల్లా నాయకులు ఒడుగు గంగాదర్ తదితరులు పాలొన్నారు.

రాందేవ్ బాబాపై చర్యలు తీసుకోవాలని నిరసన

ప్రజాశక్తి-పెనమలూరు



మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన రాందేవ్ బాబాపై చర్యలు తీసుకోవాలని పెనమలూరు మండలం తాడిగడప కార్మిక నగర్ 1, మానికొండ సుబ్బారావు అండ్ సూర్యవతి గార్ల కార్మికుల కార్యాలయం వద్ద ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల ఐద్వామహిళా సంఘం కార్యదర్శి పుసులూరి పాతాళ లక్ష్మి మాట్లాడుతూ రాందేవ్ బాబా స్త్రీలను ఉద్దేశించి మాటల్లో చెప్పలేని పదజాలం ఉపయోగించారన్నారు. భారతదేశంలో డేరా బాబాలు, రాందేవ్ బాబాలు స్త్రీలను కామన్‌గా చూస్తూ విలాస వస్తువుగా భావిస్తూ ఉండడం దుర్మార్గమని అన్నారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడే ఇలాంటి వాళ్ళని సమాజానికి దూరంగా పెట్టాలని, పతాంజలి తయారు చేసే ప్రోడక్టని ఎవరు కొనకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే ఒలీమ్మ తరిగొప్ప లావణ్య ,ఉప్పాడ ఈశ్వరి ,ఖడ్గ చేసిరేఖ ముండూరి దివ్య ,గంగ భీమవరం దుర్గ భవాని ,దాసరి రమణ ,ఏసం రవణమ్మ చెప్పాకోటేశ్వరమ్మ ,దుర్గ నాగమణి,బుర్ర నర్సమ్మ గుంజే అన్నపూర్ణ ,గుంజే దుర్గ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-గుడివాడ : కర్నూల్ జిల్లాలోని ఆత్మకూరులో డిశంబర్ 9నుండి 11వ వరకు జరిగే జూనియర్ ఖో-ఖో రాష్ట్ర ఛాంపియన్ షిప్ పోటీలకు ఎకెటిపి గర్ల హైస్తుల్ విద్యార్థిని ఎ.దేవి ఎంపికావడం అభినందనీయమని పిఇటి అనురాధ అన్నారు. బుధవారం స్థానిక ఎకెటిపి గర్ల హైస్తుల్ విద్యార్థిని ఎ.దేవిని అభినందించారు. ఈ సందర్భంగా పిఇటి అనురాధ మాట్లాడుతూ మైలవరంలో ఖో-ఖో సంఘం అధ్వర్యంలో జరిగిన బాలికల అండర్ -18 విభాగంలో దేవి రాష్ట్రస్థాయి పోటిలకు ఎంపిక అవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి అగ్రిటెక్- సదస్సు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆచార్య ఎన్జీజీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం-లాం, గుంటూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 3, 4, 5 తేదీల్లో అగ్రిటెక్ -2022 నిర్వహిస్తున్నట్టు ఏరువాక ఉయ్యూరు కేంద్రం కో-ఆర్డినేటర్ ఎం.నందకిషోర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రులు, ప్రజా ప్రతి నిధులు, ప్రభుత్వ అధికారులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని పలు అంశాలపై చర్చలు, సాంకేతిక పద్ధతులు, యాంత్రీకరణ, వివిధ పంటలలో రూపొం దించిన నూతన వంగడాల ప్రదర్శన తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఉంటాయని, రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

1061 ధాన్యం రకాన్ని 'ఎ' గ్రేడ్‌గా కొనసాగించాలి

ప్రజాశక్తి-గన్నవరం

19 సంవత్సరాలుగా ఏ గ్రేడ్ గా ఉన్న 1061 రకాన్ని కామన్ వెరైటీగా మార్పు చేయటం సరికాదని, దీనివలన క్వింటాకు 20 రూపాయలు నష్టపోవలసి వస్తుందని రైతు సంఘం గన్నవరం మండలం కార్యదర్శి సూరగాని సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడుగా ఉన్న ధాన్యాన్ని కామన్ వెరైటీగా మార్పు చేసి, మిల్లర్లకు దోచి పెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికే ఎకరానికి 26 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం రైతులు ఆ షాక్ నుండి కోలుకోక ముందే తిరిగి మరల ఈ విధంగా ప్రకటించటం చాలా శోచనీయమన్నారు. ఇప్పటికే పెట్టుబడులు పెరిగి ఖర్చులు కూడా రాని పరిస్థితులలో ధరలు తగ్గించటం సరైన విధానం కాదన్నారు.1061 రకం ఉన్నంతలో దిగుబడి పెరగటమే కాకుండా వేస్టేజ్ తక్కువగా వచ్చే రకం. కావున ప్రభుత్వం 1061 రకాన్ని ఏ గ్రేడ్ గా ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు నల్లూరి ధర్మారావు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

ప్రజాశక్తి-గన్నవరం

ఎయిర్‌పోర్టు నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని పోరాట కమిటీ నాయకులు ఏసురత్నం తెలిపారు. దావాజిగూడెం లో గత 24 రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం కూడా కొనసాగాయి. ఏసురత్నం మాట్లాడుతూ.. పేదల సమస్యలు అంటే పాలకులకు లెక్క లేకుండా ఉందని విమర్శించారు. ఇల్లు కోల్పోయి అద్దె ఇళ్లల్లో ఉంటున్న వారికి అద్దె డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు జిల్లా నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇల్లు కట్టుకోవడానికి ఒక్కొక్కరికి 15 లక్ష ల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ తక్ష ణమే స్పందించాలని కోరారు. ఈకార్యక్రమంలో నిర్వాసితులు పాల్గొన్నారు.

మిల్లర్ల ద్వారానే ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-గుడివాడ : ధాన్యం కోనుగులుకు ప్రభుత్వం విధించిన అంక్షాలను తొలగించి మిల్లర్స్ ద్వారానే కొనుగులు చేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి నేతృత్వంలో 'ఇదేం ఖర్మ మన రైతన్న'కి అంటూ పామర్రు - కత్తిపూడి జాతీయ రహదారిపై రైతులు ధర్నాను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రైతు సంఘం ఉపాధ్యక్షుడు ముళ్ళపూడి రమేష్, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళీలు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ అములు చేయాలన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడంలేదన్నారు. తేమ శాతం పేరుతో ఆర్‌బికె కేంద్రాలు రూ. 1250 కోనుగొలు దారుణమని, ఆంక్షలు ఎత్తివేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ అబ్దుల్ హబీబ్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సాయి, అట్లూరి రమణ ప్రసాద్, కర్రే వెంకటగిరి, అర్నేపల్లి పాండు, అంగడాల వీరరాజు, శ్రీను, చీకటి శేషగిరి, ఇబ్రహీం బేగ్,అనంత్, షేక్ హబ్, ఎ.శ్రీనివాసరావు, వీరస్వామి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నిర్వాసితులు



మహిళలను మనువాదంవైపు నెడుతున్న మతోన్మాదులు

ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి

ప్రజాశక్తి - విజయవాడ : మతోన్మాదులు, కొందరు రాజకీయ నాయకులు మళ్లీ మహిళలను మనువాద భావజాలంవైపునకు నెడుతున్నారనిఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి ఆందోళన వ్యక్తం చేశారు. ఐద్వా సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ప్రకాష్ నగర్‌లోని ప్రజాసంఘాల కార్యాలయంలో గురజాడ అప్పారావు వర్ధంతి నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మతోన్మాదుల ప్రయత్నాలను మహిళలు ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. గురజాడ గొప్ప సంఘసంస్కర్త, అభ్యుదయవాది, మహాకవి అని అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, వితంతువులకు పునర్వివాహాలు చేయాలని, స్త్రీ విద్యకు ఆయన అలుపెరుగని పోరాటం చేశారన్నారు. గురజాడ వంటి సంఘ సంస్కర్తల ఫలితంగానే నేడు మహిళలు ఇంటి నుంచి బయటకు వచ్చి అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో ఐద్వా సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.సరోజ, జి.ఝాన్సీ, దేవికుమారి, అమ్ములు, నిర్మల, విజయ పాల్గొన్నారు.



'తూర్పు'లో అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో బుధవారం తూర్పు నియోజకవర్గంలో పలు అభివద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, కొండ ప్రాంతాల్లో మెట్లమార్గం వంటి పలు ప్రధాన సమస్యలపై చర్చించారు. ఈసమావేశంలో కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మల కుమారి, భీమిశెట్టి ప్రవలిక, కలాపాల అంబేద్కర్, వియ్యపు అమర్‌నాథ్, మెరకనపల్లి మాధురి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) శకుంతల, జోనల్ కమిషనర్-3 డాక్టర్ ఎ.రవిచంద్, ఏ.డి.హెచ్ శ్రీనివాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వి.చంద్ర శేఖర్, ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏ.డి.హెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

21లోపు నిర్దేశిత గృహాలను పూర్తి చేయాలి : జెసి నుపూర్

ప్రజాశక్తి - విజయవాడ : జగనన్న కాలనీల్లో నిర్దేశిత గృహ నిర్మాణాలను డిసెంబర్ 21వ తేదీలోపు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ అన్నారు. జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, నాడు-నేడు పనుల ప్రగతి, స్పందన గ్రీవెన్స్ వంటి పలు అంశాలపై బుధవారం ఆమె కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి విజయవాడ సబ్ కలెక్టర్, ఆర్‌డివోలు, మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, తహశీల్దార్లు, పంచాయతీరాజ్. హౌసింగ్ ఇఇలు, డిఇలు, ఏఇలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసి మాట్లాడుతూ వారం వారం లక్ష్య సాధనలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. నందిగామ, జగ్గయ్యపేట మండలాల్లోని గృహ నిర్మాణాల పనులు ఆశించిన స్థాయిలో లేవన్నారు. పనుల పురోగతిపై వారానికి ఒకటి లేదా రెండుసార్లు మండల అధికారులతో డివిజన్ స్థాయి అధికారులు సమీక్షించాలన్నారు. సిమెంట్, ఇసుక, వాటర్ వంటి ఇతర మెటిరియల్ సమస్యలుంటే తమ వద్దకు తీసుకురావాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. నాడు-నేడు పనుల్లో భాగంగా పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు, రెవెన్యూ శాఖ కేటాయించిన నిధులను ఎప్పటికప్పుడు ఖర్చు చేసి లక్ష్యాలను పూర్తి చేసి నివేదికలు సమర్పించాలన్నారు. అలాగే నిర్దేశించిన 12,264 గృహాల్లో ఇప్పటికే 4,977 గృహాలు పూర్తయ్యాయని, మిగిలిన 7,287 గృహాల నిర్మాణాలను వారంవారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈవీడియోకాన్ఫరెన్స్‌లో విజయవాడ సబ్ కలెక్టర్ అదితి సింగ్, నందిగామ ఆర్‌డివో ఏ రవీంద్రరావు, తిరువూరు ఆర్‌డివో వైవి ప్రసన్న లక్ష్మి, హౌసింగ్ పీడీ శ్రీదేవి, డిఇవో సివి రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఇఎస్ఐ డిస్పెన్సరీ తెరవాలని ధర్నా


ప్రజాశక్తి-కంచికచర్ల: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు కంచికచర్లలో ప్రతి గడపకు వెళ్లిన స్థానిక ఎమ్మెల్యేకు కార్మికులకు ఉచిత వైద్య సదుపాయం అందించే ఇఎస్ఐ డిస్పెన్సరీ కనిపించలేదా అని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ విమర్శించారు. నాలుగు నెలలుగా మూసి ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీని తెరిపించాలని జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆస్పత్రి వద్ద నిరసన, తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా చెవిటికల్లు సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం గొట్టుముక్కల రోడ్డు, విజయరాణి హైస్కూల్ సమీపంలో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూజారి రాజేష్, జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మి కుమారి, వెంకటేశ్వరరావు, పద్మావతి, శ్రీ లక్ష్మి యాదవ్, రమాదేవి, విజయ, నాగలక్ష్మి, కంచికచర్ల అధ్యక్షుడు నాయిని సతీష్, బేతపూడి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి వెంబడి గ్రీనరీ అభివృద్ధి : స్వప్నిల్

ప్రజాశక్తి - విజయవాడ : జాతీయ రహదారి వెంబడి పచ్చదనాన్ని పెంపొందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బెంజిసర్కిల్ నుండి రామవరప్పాడు రింగ్ వరకు గల జాతీయ రహదారి వెంబడి జరుగుతున్న పనులను బుధవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాల్ పెయింటింగ్స్, గ్రీనరీ అభివద్ధిపై అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈపర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వి.చంద్రశేఖర్, ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏ.డి.హెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి : మల్లాది

ప్రజాశక్తి-విజయవాడ: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కషి చేయాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. డిసెంబర్ 1 న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నందమూరి నగర్ నుంచి పైపుల రోడ్డు కూడలి వరకు విద్యార్థులు చేపట్టిన భారీ ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ఎయిడ్స్ పై అవగాహనా ర్యాలీలో విద్యార్థినీ విద్యార్థులు పెద్దఎత్తున భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తులను అందరూ ఆదరించాలని.. వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. వ్యాధి సోకిన వాళ్ళని సమాజంలో మనతో కలిసి జీవించేలా మనోధైర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ సమరం, నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ అలంపూర్ విజయలక్ష్మి, యునైటెడ్ ఎన్జీవోస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు రాంబాబు, అరుణ మహిళా మండలి అధ్యక్షురాలు సీతారత్నం, నాయకులు అలంపూర్ విజయ్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.


వార్త మెయిన్ పేజీలో

వాసిరెడ్డి సత్యనారాయణ, వేములపల్లి వెంకట నరసమ్మ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు సిహెచ్.బాబూరావు, దోనేపూడి కాశీనాథ్, వెంకట నరసమ్మ సోదరులు విద్యాసాగర్, కోటేశ్వరరావు, కుమారులు రాహుల్, ప్రేమ్‌సాగర్, ఇతర కుటుంబ సభ్యులు

మహారాజ శ్రీ నందిగామ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.ఎస్. నెంబర్. 151/17

బిట్‌విన్:
నకిరికంటి లక్ష్మీ సునీత .... వాది
Vs
1. పులిమంతుల శ్రీనివాస్ (డైడ్). .... ప్రతివాది
2. పులిమంతుల వరలక్ష్మి W/o లేటు శ్రీనివాస్, చాకలి బజార్, జగ్గయ్యపేట.
3. బలివాడ శ్రావణి W/o కార్తీక్. D/o లేటు శ్రీనివాస్, R/o. D.No. 14_314, గాయత్రి నిలయం, జగ్గయ్యపేట.
4. పులిమంతుల శరణ్య, D/o. లేటు శ్రీనివాస్, చాకలి బజార్, జగ్గయ్యపేట.
5. పులిమంతుల హారిక స్రవంతి, D/o లేటు శ్రీనివాస్, చాకలి బజార్, జగ్గయ్యపేట.

పై నెంబర్ దావాలో వాది, ప్రోనోటు బాకీ రాబట్టుకొనుటకు దావాను దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో మొదటి ప్రతివాది అయిన పులిమంతుల శ్రీనివాస్ మరణించినారు. వారి మరణాంతరం వారి వారసులైన రెండవ ప్రతివాది భార్య మరియు 3, 4, 5 ప్రతివాదులు మొదటి ప్రతివాదికి వారసులై ఉన్నారు. వీరికి సదరు దావాలో ఎన్నిసార్లు దావా సమనులు పంపినను తీసుకోనందున శ్రీ కోర్టు వారు 2 మరియు 3, 4, 5 ప్రతివాదులకు సమనులు నిమిత్తం ది 16-12-2022 న వాయిదా వేసినారు. కావున ది. 16-12-2022 న ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారు వారి ఎదుట హాజరై 2, 3, 4, 5 ప్రతివాదులు ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల 2, 3, 4, 5 ప్రతివాదులపై పరోక్షమున తీర్మానం చేయుదురని ఇందుమూలంగా తెలియ జేయడమైనది.

వాయిదా: 16-12 2022.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

సి.హెచ్ శ్రీనివాసు,
న్యాయవాది, నందిగామ.

మహారాజా శ్రీ నందిగామ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E. P.No.55/2017 in O.S.No.369/2014.

బిట్ విన్
కోట కృష్ణ .... డిహెచ్.ఆర్.
AND
నల్లమోలు రాధిక. .... జె.డి.ఆర్.

పై నెంబర్ ఈ.పీ.లోని పైన ఉదహరించిన జే.డి.ఆర్ యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో ఉన్న ఈ కింది షెడ్యూల్డ్ ఆస్తిని ది 16.12. 2022 వ తేదీన ఉదయం గం. 10.30 ని. లకు పైన తెలుపబడిన శ్రీ కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. కావున బహిరంగ వేలంలో పాల్గొన దలచినవారు ఆ రోజున ఉదయం గం.10.30 ని. లకు పైకోర్టు వారి ఎదుట హాజరై బహిరంగ వేలంలో పాల్గొని సదరు ఆస్తిని పాడుకొన వచ్చునని ఇందుమూలంగా తెలియ జేయడమైనది.

షెడ్యూల్డ్: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం ముచింతాల గ్రామం జగ్గయ్యపేట సబ్ రిజిస్టర్ పరిధిలోని ఆర్. నెం.ఎస్.129/1 లో 0-69 సెంట్లు మరియు అర్. నెం.ఎస్. 129/2 లో 1 ఎకరం 21 సెంట్లు మరియు
అర్. నెం. ఎస్. 129/3 లో 0.72 సెంట్లు మొత్తం.
2 ఎకరాల 62 సెంట్లు లోని భూమిలో దక్షిణం వైపున ఉన్న 1 ఎకరం 31 సెంట్లు (0.535 Hers) విస్తీర్ణం గల భూమి. దీనికి హద్దులు:
తూర్పు: శ్రీ పొన్నం బాపనయ్య భూమి.
దక్షిణం: బెల్లంకొండ నారాయణ మరియు ఇతరులు భూమి. పడమర: రోడ్డు ఉత్తరం: ఉత్తరం వైపున ఉన్న నల్లమోలు లోహిత భూమి.
డి.హెచ్.ఆర్. విలువ 7,50,000-00

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

వేలం తేదీ: 16.12.2022.

గోపీనాథ్ మామిడిబత్తుల
తేదీ 30.11.2022. **డి.హెచ్.ఆర్‌తరపు న్యాయవాది,**
జగ్గయ్యపేట. **జగ్గయ్యపేట.**



ఆర్ గ్యాలరీని పరిశీలిస్తున్న ఇంతియాజ్ అహ్మద్

గురజాడ స్ఫూర్తితో ప్రజల్లో చైతన్యం తేవాలి

మొదటి పేజీ తరువాయి

సభలో ఆయన మాట్లాడుతూ గురజాడ సాహిత్యాన్ని, కవితలను, గేయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గురజాడ, జాషువా వంటి మహాకవులతోపాటు త్రిపురనేని, తిలక్ వంటి వారి రచనలు, కవితలు హేతువాద దృక్పథం ప్రస్ఫుటంగా కనిపిస్తాయన్నారు. ఇటువంటి సాహిత్యాన్ని ఈ ఆధునికకాలంలో మనమెందుకు ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నామనే భావన, బాధ కలుతోందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి ఒ.శాంతిశ్రీ మాట్లాడుతూ గురజాడ రచనల్లో స్త్రీ అభ్యున్నతి, సమాజాభివృద్ధిలో ఆమె పాత్ర, సమానత్వం గురించి ప్రధానంగా ఉంటుందన్నారు. ఆయన రాసిన 'కన్యాశుల్కం' ద్వారా ఆనాటి సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకుకట్టారన్నారు. ఆ సమస్యలే నేటికీ కొనసాగుతున్నాయన్నారు. సమాజంలో నెలకొన్న రుగ్మతలను రూపుమాపడానికి సాహితీవేత్తలు, మేధావులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురజాడ అవార్డును చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడం బాధాకరమన్నారు. ప్రముఖ కవి, రచయిత అరసవల్లి కృష్ణ మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు కృషి చేయడమే గురజాడకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. గురజాడ, గిడుగు వంటి వారు సాహిత్యలోకానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ గురజాడ తన రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో జాషువా సాంస్కృతిక వేదిక అధ్యక్ష కార్యదర్శులు సునీల్ కుమార్, గుండు నారాయణరావు, ఉపాధ్యక్షులు పరుచూరి అజయ్, అరసం కార్యదర్శి కొల్లూరు వెంకట్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రజా నాట్యమండలి కళాకారులు అభ్యుదయ గేయాలను ఆలపించారు.

నేడు, రేపు శాప్ క్రీడలకు ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-పెడన

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి డిసెంబర్ 21వ తేదీన జన్మదినాన్ని పురస్కరించుకొని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (శాప్) జగనన్న క్రీడా సంబరాలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 1,2 తేదీల్లో పెడన పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రికెట్ (పురుషులు మాత్రమే) కబడ్డీ (పురుషులు, మహిళలు) వాలీబాల్ (పురుషులు మరియు మహిళలు) క్రీడలకు సెలక్షన్ జరుగునట్లు పేర్కొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ హాజరై గురువారం ఉదయం 9 గంటలకు ఈ క్రీడా సంబరాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని పేర్కొంది. మంత్రి ఇక్కడ సెలెక్ట్ అయిన టీమ్స్ జిల్లా స్థాయిలో, అక్కడ ప్రతిభ కనబరిచిన యెడల రాష్ట్ర స్థాయిలో అవకాశం ఉంటుందని, ఫైనల్ విజేతలకు గొప్ప ప్రైజ్ మనీ కూడా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ప్రకటించింది. పెడన నియోజకవర్గంలోని 17 సంవత్సరాల దాటిన యువతి యువకులైన క్రీడాకారులు తప్పకుండా ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కార్యాలయం తెలిపింది. సెలక్షన్స్ వచ్చేవారు తప్పకుండా మీ ఆధార్ కార్డు తీసుకొని రావాలని, డిసెంబర్ 1 వ తేదీన కబడ్డీ, వాలీబాల్ క్రీడలకు, డిసెంబర్ 2 వ తేదీన క్రికెట్ క్రీడాకారుల సెలెక్షన్ జరుతాయని పేర్కొంది.



క్రీడా మైదానానికి నూతన హంగులు

బొడ్డు నాగయ్య ప్రభుత్వ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగే నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు అనుగుణంగా కళాశాల క్రీడా మైదానాన్ని పెడన మున్సిపల్ చైర్మన్ బల్ల జ్ఞాన లింగ జోష్నారాణి గంగయ్య సహకారంతో తన సొంత నిధులు సుమారు రెండు లక్షల రూపాయల వ్యయంతో క్రీడా ప్రాంగణానికి నూతన హంగులను ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లు పట్ల కాలేజీ యాజమాన్యం, పట్టణ ప్రజానీకం హర్షణ వ్యక్తం చేస్తున్నారు. క్రీడలను సంబంధించి ఏర్పాట్లను వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జున, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి కాజా, కౌన్సిలర్లు, బల్ల గంగయ్య మెట్ల గోపి వైఎస్ఆర్సిపి నాయకులు ఉమ్మిటి శ్రీను తదితరులు పరిశీలించారు.



మాట్లాడుతన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోళ్లు : అనిల్

ప్రజాశక్తి-పమిడిముక్కల

ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి సకాలంలో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. బుధవారం పమిడిముక్కల మండల అభివద్ధి కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్‌బికెలలో విక్రయించుకోవాలని అన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందరికి అందజేస్తున్నామని తెలిపారు. గడపగడప కార్యక్రమం ద్వారా మంటాడ గ్రామం సమస్యలు తెలుసుకుని లక్షల వరకు నిధులు ఇచ్చామన్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కాసానియాద సుప్రజ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మండల అభివద్ధి అధికారి సుధా ప్రవీణ్, లంకపల్లి గ్రామ సర్పంచ్ వేముల రత్నకుమారి, వీరంకుల కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు మైనేని కోటేశ్వరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, వైద్యాధికారి నాగబాబు, హనుమంతపురం సర్పంచ్ కలపాల రాంబాబు, కష్ణాపురం గ్రామ సర్పంచ్ వీరంకి బలుసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి: కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రతి ఉద్యోగికీ బదిలీ తప్పదని, అయితే వారు పని చేసిన సమయంలో కార్యదక్షత, ప్రజలతో మమేకమై చేసిన ఉద్యోగ సేవలు మాత్రమే చిరస్థాయిగా నిలిచి పోతాయని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. బదిలీపై వెళుతున్న పూర్వ జాయింట్ కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాలకు వీడ్కోలు, అదేవిధంగా జిల్లాకు నూతన జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అపరాజిత సింగ్ లకు జిల్లా అధికారులు, రెవిన్యూ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు, ఆప్యాయ స్వాగతం పలికారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో గురువారం జరిగిన సభకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం జాయింట్ కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్‌ను నూతన జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ కు స్వాగతం పలుకుతూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ చైతన్య, డిఆర్ఓ ఎం. వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయస్ జిఎం శ్రీధర్, డ్వామా పిడి జి. సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మనోహర్రావు పలు శాఖల అధికారులు తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఆ ఇరువురు ఉన్నతాధికారులను ఘనంగా సన్మానించారు.


పూర్వ జేసీ మహేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-గుడివాడ

నాయీ బ్రహ్మణులు ఐక్యతగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర నాయీ బ్రహ్మణ సవితా సమాజం రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి కోటి అన్నారు. బుధవారం స్థానిక వంకదారు కాల్యాణమండపంలో శ్రీసాయి నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సవితా సమాజం రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి కోటిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పలువురు మాట్లాడుతూ గుడివాడకు చెందిన నాయీ బ్రహ్మణ సంఘంకు చెందిన కోటి రాష్ట్రస్థాయిలో నాయకుడు అవడం గొప్ప అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వికత్తి పోతురాజు, దుర్గారావు, పెద్దలు మరెళ్ళ వెంకటేశ్వరరావు, ప్రసాద్, డా.శ్రీనివాస్, శ్రీకాకుళం జిల్లా టెక్కలి నాయకులు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యాదీవెన' విద్యార్థులకు వరం : రమేష్‌బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ : విద్యా వసతి దీవెన ద్వారా మూడేళ్లలో అవనిగడ్డ నియోజకవర్గంలో 17.70 కోట్లు నేరుగా తల్లుల ఖాతాల్లోకి జమ చేసినట్లు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రామచంద్రపురం దివిసీమ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జగనన్న విద్యా దీవెన పథకాన్ని శాసనసభ్యులు రమేష్ బాబు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డబ్బులు లేని ఏ ఒక్క విద్యార్థి కూడా చదువు మానకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న విద్యా వసతి దీవెన కార్యక్రమం వల్ల ఆర్థిక స్వాతంత్రలేని పేద విద్యార్థులు ఎందరో ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యారంగా అభివద్ధికి ప్రభుత్వం చేస్తున్న కషిని వివరించారు. కార్యక్రమంలో దివిసీమ పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్ టి పి ప్రకాష్, సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్డబ్ల్యుఓ సాల్మన్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ భారతి, ఎంపీపీ తుంగల సుమతీ దేవి, అవనిగడ్డ, కోడూరు జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీ నారాయణ, యాదవరెడ్డి సత్యనారాయణ, సర్పంచి వాకా రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా నియోజకవర్గంలో 6,593 మంది లబ్ధిదారులకు రూ.5.44 కోట్లు వారి తల్లు ఖాతాల్లో ప్రభుత్వం జమచేసిందని ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల అభివద్ధికమిటీ చైర్మన్ జంపాన కొండలరావు అన్నారు. 2022వ సంవత్సరం జూలై- సెప్టెంబరు త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన పథకంకు సంబంధించి ఏజీఅంఆర్ఎస్ఎస్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నియోజకవర్గంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలకు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెనమలూరు ఎంపీడీవో సునీతాశర్మ, ఉయ్యూరు ఎంపీడీవో విమాదేవి, తహసీల్దార్ మస్తాన్, పలువురు నగరపంచాయతీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి.. గన్నవరం :** గన్నవరం నియోజకవర్గంలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రూ.3.33 కోట్ల విద్య దీవెన కింద అందించారు. ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం చెక్కుల విద్యార్థులకు ఎంపీడీవో శేషగిరిరావు చేతుల మీదుగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల్లోని విద్యార్థులతో పాటు మధ్యతరగతి, ఈ బీసీ కుటుంబాల్లోని విద్యార్థులు చదువు కోడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారులు, ఉషా రామా కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.



అవనిగడ్డలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు



ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకలు

ఉపాధ్యాయుల అరెస్టును ఖండిస్తూ యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిల కోసం విజయవాడలో తలపెట్టిన యుటిఎఫ్ రాష్ట్రస్థాయి ధర్నా సందర్భంగా ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయడం నిరసిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో అవనిగడ్డ ప్రధానకూడలిలో ధర్నా నిర్వహించారు. అలాగే ఉపాధ్యాయులను తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అవనిగడ్డ మండల అధ్యక్ష కార్యదర్శులు కే జీవేంద్రరావు, ఎన్ శ్రీకాంత్, మోపిదేవి మండల ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ స్వామి, నాగాయలంక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి. నిరీక్షణరావు, బి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

కృష్ణా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రానున్న జనవరి 3,4 తేదీలలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్' అనే అంశం పేరిట రెండు రోజుల పాటు కృష్ణా యూనివర్సిటీలో నిర్వహించనున్న నేషనల్ సెమినార్ కి సంబంధించిన బ్రోచర్ ని యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ కే. బి. చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భం గా వైస్ ఛాన్సెలర్ మాట్లాడుతూ విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంపొందించుకొనుటకు ఇలాంటి సెమినార్స్ దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్ డి. సూర్య చంద్ర రావు,సీడీసీ డీన్ ప్రొఫెసర్ వై. కే. సుందర కృష్ణ, కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు ఆర్. కిరణ్ కుమార్, ఆర్. విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పెడన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పెడన : పెడన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అజెండాలోని పలు అంశాల మీద చర్చ జరిపారు. సంబంధిత శాఖల అధికారులు తో సమీక్ష నిర్వహించారు . జడ్పిటిసి అర్జా వెంకట నగేష్ మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రాజులపాటి అచ్యుత రావు ఉపాధ్యక్షుడు వరప్రసాద్ ఎంపీడీవో సర్పంచులు ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవ భవనంలో కల్లూరి రియానిసిక చౌదరి ప్రధమ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. కోగంటి రాధాకష్ణ మోహన్ సహకారంతో 125 మంది నిరుపేదలకు అన్నదానం జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, వారికి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల విధానాలతో ప్రజలపై భారాలు : సిఐటియు

ప్రజాశక్తి-మైలవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న విధానాలతో రోజురోజుకూ ప్రజలపై భారాలు పెరిగిపోతున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ అన్నారు. సిఐటియు మైలవరం మండల నాల్గో మహాసభ బుధవారం స్థానిక సిఎంఆర్ కన్వెన్షన్ హాలులో జరిగింది. ముందుగా మండల అధ్యక్షురాలు శారద, ఫ్రూట్స్ అండ్ హాకర్స్ యూనియన్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరావు సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఆర్.పుష్పకుమారి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం జరిగిన సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. కార్మికుల ఉపాధి దెబ్బతిని ఇబ్బంది పడుతున్న కాలంలో ధరల భారం,



మాట్లాడుతున్న శ్రీనివాస్

పన్నుల భారాలను మోపాయన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు అయ్యే వరకూ కార్మికులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నాయే తప్ప కార్మిక సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. అందరూ కలిసి సంఘాన్ని విస్తరించాలని, కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 15, 16 తేదీల్లో విజయవాడలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం 15 మందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఆర్.ఆర్.వి పుష్పకుమారి, కార్యదర్శిగా సిహెచ్ సుధాకర్, ఉపాధ్యక్షులుగా వేముల శ్రీను, కోశాధికారిగా బి.శేషమ్మ, ఉపాధ్యక్షులుగా టి.నరసింహారావు, పత్తిపాటి జ్యోతి, దుర్గారావు, వీరమ్మ, మాణిక్యం, అనిల్‌కుమార్, షేక్ అబ్దుల్లా, విజయ, వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సెక్రటరీ విజయ్, ఎం.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో గురజాడ వర్ధంతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి పట్టణ జన విజ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో అభ్యుదయ కవి గురజాడ అప్పారావు 107 వర్ధంతి సభ కొండపల్లి బాలురు జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మామిడి శీతారామారావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సువర్ణాక్షాలతో లిఖించదగ్గ పేరు గురజాడ అన్నారు. భారతీయ సంస్కృతి చరిత్ర సాహిత్య భావాలను యువతరానికి గుర్తుండే విధంగా తన రచన ద్వారా తెలియజేసిన కలం పట్టిన యోధుడు గురజాడ అప్పారావు అన్నారు. స్త్రీలను కట్టు బానిసత్వం నుంచి విముక్తి కలిగించి స్వేచ్ఛ స్వాతంత్రాలను పొందాలని స్ఫూర్తిని రగిలించిన గొప్ప సంఘసంస్కర్త గురజాడ వారు అని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు వితంతు వివాహాలు, వేశ్య వ్యవస్థ నిర్మూలన మత సాంప్రదాయాలు మూఢాచారాలు అవినీతి మొదలైన అంశాలపై రచనల్లో మార్గ నిర్దేశం చేసిన వారు గురజాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక కొండపల్లి శాఖ అధ్యక్షులు ఎస్‌కె సర్దార్ సాహెబ్, సభ్యులు చేతన్, మురళి కె.అశోక్, కె.బాలకృష్ణ పాల్గొన్నారు.



నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ ప్రారంభిస్తునట్లు సొసైటీ అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడానికి వసంత కష్ణ ప్రసాద్ కషి చేస్తున్నారన్నారు. రెడ్డిగూడెం సొసైటీ ద్వారా ధాన్యము సేకరించి , సకాలంలో రైతులకు నగదును చెల్లించడం జరుగుతుందన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి అధిక సంఖ్యలో రైతులు తరలిరావాలని కోరారు.

పి.నైనవరంలో సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే వంశీకి సిపిఎం వినతి

ప్రజాశక్తి-విజయవాడరూరల్: మండలంలోని పి.నైనవరం గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు స్థానిక సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నున్న ఉంచి అంబాపురం వెళ్లే ప్రధాన రహదారిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక చిన్నపాటి వర్షానికే రోడ్లు అస్తవ్యస్తంగా మారుతున్నాయన్నారు. దీని వల్ల స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ ప్రధాన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టెండర్ దశలో ఉన్న పనులను నిలిపివేయడంతో ప్రధాన రహదారి పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయన్నారు. పి.నైనవరం గ్రామానికి కృష్ణాజలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేదలకు పాతపాడు కొండ ప్రాంతాల్లో కాకుండా స్థానికంగానే స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మాతంగి ఆంజనేయులు, సట్టు శ్రీనివాసరావు, ముగడ సురేష్, మాతంగి నాగమల్లేశ్వరరావు, ముగడ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన అవసరం



ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ కంప్యూటర్ భద్రతా దినోత్సవం సందర్భంగా సైబర్ సెక్యూరిటీ -ఎథికల్ హ్యాకింగ్ అనే అంశంపై అతిధ్యోపన్యాసం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. సుప్రజా టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు చలువాది సంతోష్ సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన నేరాలు, ఆఫర్ల పేరిట మొబైల్ ఫోన్లకు పంపించే నకిలీ సందేశాలు, బ్యాంకు ఖాతా నంబర్లు, పాస్‌వర్డ్, ఆధార్ నంబర్లు వంటి కీలక సమాచారాన్ని తస్కరించటానికి సైబర్ నేరగాళ్లు అనుసరించే విధానాలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో నకిలీ ఫేస్బుక్ ఖాతాలు సష్టించి వారి పరిచయస్తులందరికీ ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌ల ద్వారా నగదు బదిలీ చేయమని సందేశాలు పంపటం సర్వ సాధారణంగా మారిందని దీనిని నివారించటానికి ఫేస్‌బుక్ ఖాతాదారులు తమ ఎకౌంట్లను లాక్ చేయడం ద్వారా పదిల పరచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉపాధి అవకాశాల గురించి తమ సందేహాలను సంతోష్ ద్వారా నివత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టి.ఎస్.రవికిరణ్, శిక్షణా ఉపాధి విభాగాధికారి కావూరి శ్రీధర్, ఇంచార్జ్ కోనేరు సుధీర్ పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ మైలవరం కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి-మైలవరం: ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ మైలవరం తాలూకా యూనిట్ అధ్యక్షులుగా జె.రఘుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ మైలవరం తాలూకా యూనిట్ కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. జి.రఘుపతి ప్యానల్ ఒకటే నామినేషన్ వెయ్యడం వల్ల ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి యం.ప్రకాశ్‌బాబు, సహాయ ఎన్నికల అధికారి జి.పుల్లయ్య తెలిపారు. సెక్రటరీగా సయ్యద్ ఖాదిర్, అసోసియేట్ అధ్యక్షులుగా వై.బసవ లింగేశ్వరరావు, కోశాధికారిగా వి.శ్రీనివాసరావు, సహాయక అధ్యక్షులుగా వి.దుర్గాప్రసాద్, ఎస్.జనార్ధనరావు, అబ్దుల్ వదూల్, సహాయ కార్యదర్శులుగా యం.మంజుల, ఎ.వెంకటేశ్వరరావు, కె.సరితా దేవి, మహిళా జాయింట్ కార్యదర్శిగా సిహెచ్ ఫణిప్రియ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అబ్బురపరిచిన బజాజ్ స్టంట్స్

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలో చైతన్య కాలేజీలో విద్యార్థులను బజాజ్ స్టంట్స్ కార్యక్రమం అబ్బురపరిచింది. ది వరల్డ్ ఫేవరెట్ ఇండియన్ బజాజ్ టు వీలర్ తయారీ కంపెనీ బజాజ్ కు చెందిన పల్సర్ ఎన్‌ఎస్ 125 స్పోర్ట్స్ మోడల్ ద్విచక్ర వాహనంతో నిపుణులు స్టంట్ లు చేసి విద్యార్థులను అలరించారు పల్సర్ ద్వీచక్ర వాహనంతో చేస్తున్న విన్యాసాలకు, విద్యార్థులు చప్పట్లతో హర్షరెత్తించారు. ఈ సందర్భంగా రిజ్వాన్ బజాజ్ కంపెనీ నిర్వాహకులు మాట్లాడుతూ కొత్త పల్సర్ ఎన్ ఎస్ 125 ప్రత్యేకతలు వివరించారు. స్పోర్ట్స్ బైక్ల లపై యువకులు ఉన్న మక్కువ దృష్టిలో ఉంచుకొని అనుభవజ్ఞులైన నిపుణుల సారధ్యంలో కొత్త పల్సర్ ఎన్ ఎస్ 125 ద్విచక్ర వాహనాన్ని తయారు చేశారని, కొత్త డిజైన్, కొత్త ఇంజనం వివిధ రకాల కొత్త ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. ఎఎస్ఎం సదాత మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కచ్చితంగా లైసెన్స్ పొంది ఉండాలని చెప్పారు. డిజిఎం వేమా శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్రను నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అమర్నేని రమేష్‌బాబు, బ్రాంచ్ మేనేజర్ టీవీ రెడ్డి పాల్గొన్నారు.



4న శాప్ చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ - ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో శాప్ చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు శాప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ యన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. నగరంలోని ఐజిఎంసి స్టేడియంలోని శాప్ కార్యాలయంలో బుధవారం ఉదయం పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీలకు వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు విడి విడిగా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. చెస్ రేటింగ్ 1500లోపు ఉన్న



క్రీడాకారులందరూ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను క్రింది ఫోన్ నెంబర్ ద్వారా తెలుసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9030308811 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

ఉపాధ్యాయుల అక్రమ అరెస్టులు సరికాదు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని , పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలు, మెడికల్ బిల్లులను విడుదల చేయాలని కోరుతూ నిరసన తెలియచేస్తున్న ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి సి.హెచ్. వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఉపాధ్యాయులు తమకు రావాల్సిన బకాయిలు ఇవ్వమని అడిగినందుకు ప్రభుత్వం ఉపాధ్యాయులపై ఉద్యోగులపై ముందస్తు నిర్బంధం, అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమని అన్నారే. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులని కూడా చూడకుండా పోలీసులు వారు దారుణ:గా నడిరోడ్డుపై ఈడ్చుకెళ్లి అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం తగదని అన్నారు. మన రాష్ట్రంలో అక్షరాస్యతా శ్శాతం నేటికీ 67 గా ఉన్న క్రమంలో పూర్తిశాతం అక్షరాస్యత సాధించడం కోసం ప్రభుత్వం ప్రయత్నాలు చేసి ఉపాధ్యాయులకు అండదండలు లివ్వాల్సిందిపోయి కావాలని ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వారికి రావాల్సిన డిఎ బకాయిలు, మెడికల్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-తిరువూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తిరువూరు మండలంలోని మునుకుళ్ల గ్రా మంలో వరిలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సద స్సు బుధవారం జరిగింది. జిల్లా శిక్షణా కేంద్రం డిడిఎ టి.మాధవిలత మాట్లా డుతూ ప్రతివారం పొలంబడి నిర్వ హించుట ద్వారా మంచి యాజమాన్య పద్ధతులు పాటించవచ్చని తెలిపారు. ఇలా మూడు సంవత్సరాలు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించిన రైతులకి జిఎపి సర్టిఫికేషన్ ఇస్తామ న్నారు. వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటను చీడపీడల నుండి కాపాడుకోవచ్చన్నారు. మట్టి నమూనాలు సేకరణ ఎలా చేయాలో రైతులకి వివరించారు. పొలంలో మట్టి నమూనాలు రైతులు, వ్యవసాయ స హాయకులు ద్వారా తీయించారు. ఈ కార్యక్రమంలో ఏడిఎలు మోనీషా, జి.కెనడీ, ఏవోలు పద్మ, సురేష్, టిప్పుసుల్తాన్, సర్పంచ్ ఎస్.కుమారి, ఎంపీటీసీ ఎన్.వెంకటకృష్ణ పాల్గొన్నారు.